1st Year
Happy Work Anniversary.

షణ్ముఖ
SHANMUKHAVELUGU
RNI : APTEL / 2023 / 89152

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక

Good for Health
Best for Readers
THE POWER OF RK PEN

సంపుటి : 03 సంచిక : 165
సోమవారం 22 జూన్ 2026 పేజీలు 8 వెల : రూ.3

Printed by Ongole. Published From Ongle, Nellore, Guntur, Markapur, Bapatla.

## చాలా కాలం పాటు ఎన్డీయే పాలన

### కేంద్ర హోంమంత్రి అమిత్ షా



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, జూన్ 21)

కొల్హాపుర్: స్వతంత్ర భారతావని చరిత్రను గ్రంథస్థం చేసేటప్పుడు ప్రధాని నరేంద్రమోదీ పాలన సువర్ణాక్షరాల్లో నిలిచిపోతుందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నారు. దేశానికి జవసత్వాలు తీసుకువచ్చి, ప్రపంచవ్యాప్తంగా పరువు ప్రతిష్ఠల్ని ఇనుమడింపజేసిన నేతగా ఆయన పాలన గుర్తింపు పొందుతుందని చెప్పారు. మహారాష్ట్రలోని అంబాబాయ్ ఆలయ కారిడార్ ప్రాజెక్టు పనులను శనివారం ప్రారంభించిన తర్వాత అమిత్ షా ప్రసంగించారు. కొల్హాపుర్ జిల్లాలో మరో సభలోనూ మాట్లాడారు. అసాధ్యమని ఒకప్పుడు అనుకున్న అనేక లక్ష్యాలను గత పన్నెండేళ్ల కాలంలో మోదీ సుసాధ్యం చేశారని, అయోధ్య రామాలయం నిర్మాణం సహా అనేక ఆలయాలను అభివృద్ధి చేసిన తీరు దానికి ఉదాహరణ అని చెప్పారు. చంద్రయాన్-3 విజయం ద్వారా మనదేశం చంద్రుని దక్షిణ ధ్రువ ప్రాంతాన్ని చేరగలిగిందని గుర్తుచేశారు. ఇది ప్రారంభం మాత్రమేనని, భాజపా.. ఎన్డీయేల పాలన అనేక ఏళ్లపాటు దేశంలో కొనసాగుతుందని చెప్పారు. దేశం ధర్మశాల కాదు: భారత దేశమంటే ధర్మశాల కాదని అమిత్ షా స్పష్టం చేశారు. ఈ దేశానికి చెందినవారే ఇక్కడ నివసిస్తారని చెప్పారు. బెంగాల్‌లో తమపై విశ్వాసం ఉంచి అధికారాన్ని కట్టబెట్టిన ఓటర్లకు కృతజ్ఞతగా అక్కడి చొరబాటుదారుల్లో ప్రతిఒక్కరినీ గుర్తించి.. దేశం నుంచి తరిమికొడతామని మరోసారి ప్రకటించారు. మహారాష్ట్రలో శివసేన (యూబీటీ) చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే.. కాంగ్రెస్ ఒడిలో కూర్చొని చొరబాటుదారుల్ని ఓటుబ్యాంకుగా మార్చుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. తాము మాత్రం వారిని వదిలిపెట్టేది లేదన్నారు. ఇదివరకు ప్రజలు శివసేన- శిందే వర్గమంటూ చెప్పుకోవాల్సి వచ్చేదని, ఇప్పుడు రెండో వర్గంలో చీలికలతో ఇదొక్కటే శివసేనగా మిగిలిందని వ్యాఖ్యానించారు.

# బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రికి 25 ఏళ్లు..

## రజతోత్సవ వేడుకలకు హాజరుకానున్న చంద్రబాబు

- సోమవారం బసవతారకం ఆసుపత్రి రజతోత్సవాలు
- ముఖ్య అతిథిగా హాజరుకానున్న ఏపీ సీఎం చంద్రబాబు
- 25 ఏళ్లుగా క్యాన్సర్ రోగులకు నిరంతర సేవలు
- ఎన్టీఆర్ ఆశయాలను చైర్మన్‌గా కొనసాగిస్తున్న బాలకృష్ణ
- పేదలకు తక్కువ ఖర్చుతో ప్రపంచ స్థాయి వైద్యం



2

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 21)

క్యాన్సర్ బాధితులకు తక్కువ ఖర్చుతో ప్రపంచ స్థాయి వైద్యం అందించాలన్న మహోన్నత లక్ష్యంతో ఏర్పాటైన బసవతారకం ఇండో-అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ 25 ఏళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకుంది. ఈ చారిత్రక మైలురాయిని పురస్కరించుకుని సోమవారం హైదరాబాద్‌లోని హెచ్‌ఐసీసీ నోవోటెల్‌లో రజతోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. ఆసుపత్రి ఛైర్మన్, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఆధ్వర్యంలో జరగనున్న ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి

## యోగా నాకు చాలా ఇచ్చింది



**డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్**
**యోగతోనే తనకు లోతైన స్పష్టత, పరిపక్వత లభించాయని చెప్పిన పవన్ కల్యాణ్**
**తన దినచర్యలో క్రియ యోగ, అష్టాంగ యోగ అంతర్భాగమని వెల్లడి**

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 21)

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ యోగాతో తనకున్న అనుబంధాన్ని పంచుకున్నారు. యోగా తనకు లోతైన స్పష్టతను, అంతర్గత పరిపక్వతను అందించిందని, తన ప్రయాణాన్ని అది ఎంతగానో ప్రభావితం చేసిందని ఆదివారం ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు సోషల్ ▶మిగతా 2లో

## సీఎం చంద్రబాబు రైతులకు క్షమాపణ చెప్పాలి.. షర్మిల డిమాండ్



**అన్నదాత సుఖీభవ పథకంపై ఏపీ ప్రభుత్వాన్ని విమర్శించిన వైఎస్ షర్మిల**
**మూడో ఏడాదీ రైతులకు పాక్షికంగానే నిధులు విడుదల చేశారని ఆరోపణ**
**60 లక్షల మంది అర్హులుంటే 46 లక్షల మందికే సాయం అందిందని వ్యాఖ్య**

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 21)

ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రభుత్వం రైతులను వంచిస్తోందని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ▶మిగతా 2లో

## నీట్ పరీక్ష.. ప్రయాణం వాయిదా వేసుకున్న ప్రధాని మోదీ

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, జూన్ 21)



దేశవ్యాప్తంగా నీట్ రీటెస్టు జరుగుతోంది. దీని కోసం అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. ఈ పరీక్షను దృష్టిలో ఉంచుకుని ప్రధాని నరేంద్ర మోదీ సైతం సమయానుకూల నిర్ణయం తీసుకున్నారు. పశ్చిమ బెంగాల్ పర్యటన అనంతరం మధ్యాహ్నం దిల్లీ విమానాశ్రయానికి చేరుకున్న ఆయన.. అధికారిక నివాసానికి వెళ్లేందుకు తన ప్రయాణాన్ని కాసేపు వాయిదా వేసుకున్నారు. నీట్ పరీక్ష కోసం ఎగ్జామ్ సెంటర్లకు వెళ్లే విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. నీట్ రీటెస్టు ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమైంది. అయితే, ప్రధాని మోదీ మధ్యాహ్నం 1.15 గంటల సమయంలో దిల్లీ విమానాశ్రయానికి చేరుకున్నారు. షెడ్యూల్ ప్రకారం ఆయన వెంటనే అక్కడి నుంచి అధికారిక నివాసానికి బయల్దేరాలి. కానీ.. తన ప్రయాణాన్ని కాసేపు వాయిదా వేసుకున్నారు. నీట్ పరీక్షకు వెళ్లే విద్యార్థులకు ఎలాంటి అంతరాయం కలగకుండా ఉండేందుకు దేశ రాజధానిలో ట్రాఫిక్ సజావుగా సాగేలా ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు పరీక్ష ప్రారంభమైన తర్వాత ఎయిర్‌పోర్ట్ నుంచి తన నివాసానికి బయలుదేరినట్లు చెప్పారు.

ఒకే రోజు మూడు యుద్ధనౌకలు.. భారత సముద్రశక్తికి చిహ్నం..! ▶మిగతా 2లో

## పెండింగ్ సమస్యలపై ఏపీ ఉద్యోగుల అల్టిమేటం

- పీఆర్సీ ఏర్పాటు చేయాలంటూ ప్రభుత్వానికి ఉద్యోగుల హెచ్చరిక
- సరెండర్ లీవుల బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 21)

రాష్ట్రంలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళనలు తప్పవని ఏపీ ప్రభుత్వ ఉద్యోగ సంఘాలు హెచ్చరించాయి. ముఖ్యంగా నూతన వేతన సవరణ కమిషన్ (పీఆర్సీ) ఏర్పాటులో జరుగుతున్న జాప్యంపై వారు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. శనివారం విజయవాడ గాంధీనగర్‌లోని ఎన్జీవో ▶మిగతా 2లో

## పాస్‌పోర్టు దరఖాస్తుల వెరిఫికేషన్‌లో రాష్ట్రానికి పురస్కారం

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, జూన్ 21)




పాస్‌పోర్ట్ దరఖాస్తుల వెరిఫికేషన్ ప్రక్రియలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు ఏపీ పోలీసు శాఖకు జాతీయ స్థాయిలో గుర్తింపు దక్కింది. 2025 సంవత్సరంలో అందించిన సేవలకు 'ఇన్‌స్టిట్యూషనల్ పెర్ఫార్మెన్స్ అవార్డ్ ఫర్ స్టేట్ పోలీస్' పురస్కారం లభించింది. పాస్‌పోర్టు సేవా దివస్ సందర్భంగా దిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో విదేశాంగ మంత్రి జైశంకర్ ▶మిగతా 2లో

## మా దేశం గురించి మాట్లాడొద్దు.. పాకిస్థాన్‌కు భారత్ స్ట్రాంగ్ వార్నింగ్

**భారత్‌లోని ముస్లిం ప్రార్థనా స్థలాలపై పాక్ అధ్యక్షుడు జర్దారీ వ్యాఖ్యలు**

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, జూన్ 21)



భారత్‌లోని ముస్లిం ప్రార్థనా స్థలాలకు ముప్పు పొంచి ఉందంటూ పాకిస్థాన్ అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ చేసిన ▶మిగతా 2లో

## త్వరలో 'నేతన్నకు భరోసా'

**చేనేతలకు ఏడాదికి రూ.25 వేల చొప్పున అందజేత**
**చేనేత, జౌళి శాఖలో రెండేళ్ల ప్రగతిపై మంత్రి సవిత వెల్లడి**




(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 21)

చేనేత కార్మికులకు ఆర్థిక భరోసానిచ్చే 'నేతన్నకు భరోసా' పథకాన్ని త్వరలో అమలు చేయనున్నట్లు చేనేత, జౌళిశాఖ మంత్రి సవిత ప్రకటించారు. ఈ పథకం కింద ఏడాదికి రూ.25వేల చొప్పున అందిస్తామన్నారు. ఇందుకు మార్గదర్శకాలు రూపొందిస్తున్నామని వివరించారు. వారి ఆరోగ్య భద్రతకు యూనివర్సల్ హెల్త్‌పాలసీని అమలు చేయనున్నట్లు వివరించారు. రాజధాని అమరావతిలో నిఫ్ట్ ఏర్పాటుకు ఇప్పటికే కేంద్రమంత్రి సూత్రప్రాయంగా అంగీకరించారని, త్వరలో తీపికబురు అందనుందని వెల్లడించారు. అమరావతిలోనే చేనేత, హస్తకళల మ్యూజియం ఏర్పాటుకు కేంద్రానికి నివేదించామన్నారు. ▶మిగతా 2లో

## బోయపాడు తీరంలో కాలుష్యంపై డిప్యూటీ సీఎం పవన్ ఆరా



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 21)

అనకాపల్లి జిల్లా బోయపాడు తీర ప్రాంతంలో చేపలు మృతి చెందినట్టు వచ్చిన సమాచారంపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆరా తీశారు. ఈ ఘటనపై విచారణ చేపట్టి సమగ్ర నివేదిక ఇవ్వాలని ఏపీ కాలుష్య నియంత్రణ మండలి సభ్య కార్యదర్శిని ఆదేశించారు. చేపల మృతికి గల కచ్చితమైన కారణాలను అన్వేషించేందుకు శాస్త్రీయ పరిశోధనలు చేపట్టాలని కాలుష్య నియంత్రణ మండలి, మత్స్యశాఖ అధికారులు, మెరైన్ సైంటిస్టులకు సూచించారు. దీనిపై నిపుణులతో క్షుణ్ణంగా అధ్యయనం చేయాలన్నారు. చేపలు మృతి చెందిన ప్రాంతంలో నీటి నమూనాలు, మృతి చెందిన చేపల శాంపిల్స్ సేకరించి ఇప్పటికే పరీక్షల నిమిత్తం పంపారు. సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో విచారణ పూర్తి చేయాలని ఉప ముఖ్యమంత్రి ▶మిగతా 2లో

## గ్రామంలో రాములవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం

(షణ్ముఖ వెలుగు, త్రిపురాంతకం, జూన్ 21)



త్రిపురాంతకం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసినటువంటి రాములవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా గ్రామం చుట్టూ పట్టాభి సీతారామచంద్రస్వామి గ్రామోత్సవం అంగరంగ వైభవంగా గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేశారు. సోమవారం విగ్రహ ప్రతిష్ఠ ధ్వజస్తంభం నిలుపుతారని ఆలయ నిర్వాహకులు తెలిపారు. కావున రామభక్త బృందం అంతా ఈ కార్యక్రమంలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 12వ అంతర్జాతీయ యోగాంధ్ర





(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జూన్ 21)

మండల కేంద్రమైన ప్రభుత్వ ఉన్నత పాఠశాల నందు ఆదివారం 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగాంధ్ర కార్యక్రమం విజయవంతంగా నిర్వహించినారు. ఈ కార్యక్రమానికి మండల పరిషత్ అభివృద్ధి అధికారి బి సురేష్, ఇన్చార్జి ఎంఈఓ 1 పీవీ రత్నం, ఎంఈఓ 2 పివి రమణయ్య, మాస్టర్ ట్రైనర్స్ కే సుబ్బారావు, పి హాజరత్తయ్య, కె రమాదేవి పాల్గొని స్కూల్ విద్యార్థులకు సచివాలయ సిబ్బంది అంగన్వాడి కార్యకర్తలు ఆరోగ్య శాఖ సిబ్బంది అందరికీ యోగాసనాలను చేయించినారు. ఈ సందర్భంగా ఎంపీడీవో బి సురేష్ మాట్లాడుతూ యోగ ప్రతిరోజు ఒక గంట పాటు చేయడం వలన ఆరోగ్యం మెరుగుపడుతుందని యోగ ప్రాధాన్యతను వివరించినారు. అనంతరం యోగ ప్రతిజ్ఞను చేయించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

## జిల్లా న్యాయస్థానం ఆవరణలో యోగా దినోత్సవం





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 21)

12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఆదివారం ఒంగోలు పట్టణంలో జిల్లా న్యాయస్థానం ఆవరణలో రాష్ట్ర హైకోర్టు వారి సూచనల ప్రకారం యోగా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఏ సత్యానంద్, అదనపు జిల్లా న్యాయమూర్తులు టి రాజ్యలక్ష్మి, కే శ్యాంబాబు, పి లలిత, పూర్ణిమ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు ఇన్‌ఛార్జి కార్యదర్శి సిహెచ్ వి రామకృష్ణ, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ న్యాయమూర్తి వి పల్లవి, ఇతర జూనియర్ సివిల్ న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సిహెచ్ రమేష్ బాబు, ఇతర న్యాయవాదులు పాల్గొన్నారు. యోగ కార్యక్రమం నిర్వాహకులుగా న్యాయవాది ఎన్ దేవ కుమారి వ్యవహరించారు.

మొదటి పేజీ తరువాయి

## యోగా నాకు చాలా ఇచ్చింది

మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో తన అభిప్రాయాలను పంచుకున్నారు."భారత నాగరికతలో యోగా ఒక అంతర్భాగం. ప్రపంచానికి భారత్ అందించిన అద్భుతమైన బహుమతి ఇది. శారీరక ఆరోగ్యం, మానసిక స్పష్టత, అంతర్గత సమతుల్యతను యోగా ప్రోత్సహిస్తుంది. ప్రతి ఒక్కరూ యోగాను తమ జీవనశైలిలో భాగం చేసుకోవాలి" అని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు.చిన్న వయసులోనే తాను యోగా ప్రయాణం ప్రారంభించానని ఆయన గుర్తుచేసుకున్నారు. "నా మదిలో ఎన్నో ప్రశ్నలతో సతమతమవుతున్న సమయంలో, యోగా నాకు సమాధానాలు ఇవ్వడమే కాకుండా, ప్రగాఢమైన స్పష్టతను, పరిపక్వతను ఇచ్చింది. నా ప్రయాణానికి సరైన మార్గాన్ని చూపింది. క్రియ యోగ, అష్టాంగ యోగ, ఆర్ట్ ఆఫ్ లివింగ్‌కు చెందిన సుదర్శన క్రియ వంటివి ఇప్పటికీ నా దినచర్యలో అంతర్భాగంగా కొనసాగుతున్నాయి" అని ఆయన వివరించారు.

యోగాకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తీసుకురావడంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేసిన కృషిని పవన్ కల్యాణ్ ప్రశంసించారు. జూన్ 21ని అంతర్జాతీయ యోగా దినోత్సవంగా జరుపుకోవాలన్న మోదీ చొరవకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

### విశాఖలో ఘనంగా యోగా వేడుకలు

మరోవైపు, రాష్ట్రవ్యాప్తంగా 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. విశాఖపట్నంలోని సాగరిక ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర హోం మంత్రి వి. అనిత పాల్గొన్నారు. ప్రభుత్వ విప్ గణబాబు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుతో కలిసి ఆమె యోగాసనాలు వేశారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిషోర్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, ఆంధ్ర యూనివర్సిటీ వైస్-ఛాన్సలర్ జి.పి. రాజశేఖర్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. యోగా అసోసియేషన్ ప్రతినిధులు, ఇతర సంఘాల సభ్యులు, సాధారణ పౌరులు, యువత ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

## సీఎం చంద్రబాబు రైతులకు క్షమాపణ చెప్పాలి.. షర్మిల డిమాండ్

తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. 'అన్నదాత సుఖీభవ' పథకం కింద అరకొర నిధులు విడుదల చేసి, వరుసగా మూడో ఏడాది కూడా రైతులకు అన్యాయం చేశారని ఆమె ఆరోపించారు.రాష్ట్ర ప్రభుత్వం జూన్ 20న 'అన్నదాత సుఖీభవ' పథకం కింద మొదటి విడత ఆర్థిక సాయాన్ని రైతుల ఖాతాల్లో జమ చేసింది. పీఎం-కిసాన్ పథకం నిధులతో కలిపి సుమారు 46.86 లక్షల రైతు కుటుంబాలకు ఈ ప్రయోజనం చేకూరింది. దీనిలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ.5,000, కేంద్రం వాటాగా రూ.2,000 కలిపి ప్రతి లబ్ధిదారుడికి మొత్తం రూ.7,000 చొప్పున అందాయి.ఈ నేపథ్యంలో సోషల్ మీడియా వేదికగా స్పందించిన షర్మిల, ప్రభుత్వాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. రాష్ట్రంలో దాదాపు 60 లక్షల మంది అర్హులైన రైతులు ఉండగా, కేవలం కొంతమందికి మాత్రమే నిధులు కేటాయించారంటూ ఆమె ఆక్షేపణ వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు హామీ ఇచ్చిన పెట్టుబడి సాయం, కనీస మద్దతు ధర, పంటల బీమా వంటి వాగ్దానాలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.ఇచ్చిన మాట తప్పినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని షర్మిల డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో సంబంధం లేకుండా, రాష్ట్ర ప్రభుత్వమే సొంతంగా ఈ పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని ఆమె సూచించారు.

## పెండింగ్ సమస్యలపై ఏపీ ఉద్యోగుల అల్టిమేటం

భవన్‌లో ఉద్యోగ సంఘాల ఐక్య కార్యాచరణ సమితి (జేఏసీ) సమావేశమై భవిష్యత్ కార్యాచరణపై చర్చించింది.ఈ సందర్భంగా ఏపీ ఎన్జీవో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎ. విద్యాసాగర్ మాట్లాడుతూ.. 2023 నుంచి పీఆర్సీని ఏర్పాటు చేయకపోవడంతో ఉద్యోగులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొన్ని సమస్యలను పరిష్కరించినప్పటికీ, ప్రధాన డిమాండ్ల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. సరెండర్ లీవుల బకాయిలను వెంటనే విడుదల చేయాలని, హెల్త్ కార్డులు పూర్తిస్థాయిలో అమలయ్యేలా చూడాలని జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ఎస్. ప్రసాద్ డిమాండ్ చేశారు.తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని త్వరలోనే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సమర్పించాలని ఈ సమావేశంలో తీర్మానించారు. ఇందులో భాగంగా జులై 1 నుంచి 8వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా ఎంపీలు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లకు విజ్ఞప్తి చేయాలని నిర్ణయించారు. అప్పటికీ ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన రాకపోతే, జూన్ 26న మరోసారి సమావేశమై తదుపరి కార్యాచరణను ప్రకటిస్తామని వారు స్పష్టం చేశారు.

## మా దేశం గురించి మాట్లాడొద్దు.. పాకిస్థాన్‌కు భారత్ స్ట్రాంగ్ వార్నింగ్

వ్యాఖ్యలను భారత్ తీవ్రంగా ఖండించింది. దేశ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకునే హక్కు జర్దారీకి లేదని స్పష్టం చేసింది. ఆయన వ్యాఖ్యలు అసంబద్ధమైనవని, అనవసరమైనవని భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ కొట్టిపారేశారు.వారణాసిలోని కాశీ రైల్వే స్టేషన్ సమీపంలో గల గంజ్ షహీదా మసీదుకు భారత రైల్వే శాఖ జారీ చేసిన నోటీసులను ఉద్దేశించి జర్దారీ ఈ వ్యాఖ్యలు చేశారు. దీనిపై గురువారం రణధీర్ జైస్వాల్ స్పందిస్తూ.. పాక్ అధ్యక్షుడి ప్రకటనను భారత్ నిర్ద్వంద్వంగా తిరస్కరిస్తోందని, భారత అంతర్గత విషయాలపై మాట్లాడే అర్హత ఆయనకు ఏమాత్రం లేదని తేల్చిచెప్పారు.పాకిస్థాన్‌లో మైనారిటీల హక్కుల ఉల్లంఘన, అక్కడి మానవ హక్కుల దయనీయ స్థితిపై అంతర్జాతీయంగా వస్తున్న విమర్శలను జైస్వాల్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఇతరులకు హితవు పలికే ముందు పాక్ తన దేశంలోని పరిస్థితులను చక్కదిద్దుకోవాలని సూచించారు. ద్వేషం, మతతత్వాన్ని ప్రోత్సహించడమే పాకిస్థాన్ జాతీయ విధానంగా కనిపిస్తోందని ఆయన విమర్శించారు.భారత్ తన అంతర్గత విధానాలకు సంబంధించిన అంశాల్లో, ముఖ్యంగా జమ్మూకశ్మీర్ వంటి విషయాల్లో విదేశాల జోక్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోదని చాలాకాలంగా స్పష్టం చేస్తూ వస్తున్న విషయం విదితమే.

## పాస్‌పోర్టు దరఖాస్తుల వెరిఫికేషన్‌లో రాష్ట్రానికి పురస్కారం

చేతుల మీదుగా నిఘా విభాగం ఎస్పీ ఎ.రమాదేవి.. డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా తరఫున ఈ పురస్కారం స్వీకరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సమర్థ నాయకత్వంలో ఏపీ పోలీసుల సమష్టి కృషితోనే జాతీయ స్థాయిలో గౌరవం లభించిందని డీజీపీ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. నిఘా విభాగం అధిపతి మహేశ్ చంద్ర లడ్డా, జిల్లాల ఎస్పీలు, నగర పోలీసు కమిషనర్లను అభినందించారు.

## త్వరలో 'నేతన్నకు భరోసా'

చేనేత, జౌళి శాఖలో రెండేళ్ల ప్రగతిపై మంత్రి సవిత సచివాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. 'సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, విద్యాశాఖ మంత్రి లోకేశ్, సీఎం సతీమణి భువనేశ్వరి చేనేత వస్త్రాలను బాగా ప్రమోట్ చేస్తున్నారు. చేనేతలకు అండగా నిలిచేలా ప్రతి ఒక్కరూ వారంలో ఒకరోజు చేనేత వస్త్రాలను ధరించాలి. కూటమి అధికారంలోకి వచ్చాక నేత కార్మికుల ఉపాధి మెరుగయ్యేలా అన్ని చర్యలు తీసుకుంటున్నాం' అన్నారు.

## బోయపాడు తీరంలో కాలుష్యంపై డిప్యూటీ సీఎం పవన్ ఆరా

దిశానిర్దేశం చేశారు. సముద్ర జీవ వైవిధ్యం, పర్యావరణ సమతుల్య పరిరక్షణ, మత్స్యకారుల జీవనోపాధి సంరక్షణ.. ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత అంశాలుగా ముందుకు తీసుకువెళ్తుందని తెలిపారు. బోయపాడు తీరంలో పరిస్థితిని ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తుందని, శాస్త్రీయ నివేదికలు అందిన వెంటనే తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## నీట్ పరీక్ష.. ప్రయాణం వాయిదా వేసుకున్న ప్రధాని మోదీ

నీట్ రీటెస్టును ఎన్‌టీఏ కట్టుదిట్టంగా నిర్వహిస్తోంది. 22 లక్షల మందికిపైగా విద్యార్థుల కోసం దేశవ్యాప్తంగా 5,440, విదేశాల్లో 14 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసింది. ఏఐ ఆధారిత నిఘా సహకారంతో 1.38 లక్షల సీసీటీవీ కెమెరాల ద్వారా 95 వేలకుపైగా పరీక్షా గదులను అధికారులు పర్యవేక్షిస్తున్నారు. ఎలక్ట్రానిక్ పద్ధతిలో జరిగే మోసాలను అరికట్టేందుకు 51 వేలకుపైగా సిగ్నల్ జామర్లను ఏర్పాటు చేశారు.

## బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రికి 25 ఏళ్లు..

### రజతోత్సవ వేడుకలకు హాజరుకానున్న చంద్రబాబు

చంద్రబాబు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు తన అర్ధాంగి బసవతారకం జ్ఞాపకార్థం, ఆమె చివరి కోరిక మేరకు ఈ ఆసుపత్రి ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. క్యాన్సర్ చికిత్స సామాన్యులకు అందుబాటులో ఉండాలనే సంకల్పంతో 1988లో ఈ బృహత్కార్యానికి అంకురార్పణ చేశారు. ప్రవాస భారతీయులు, వైద్య నిపుణులు, దాతల సహకారంతో ఏర్పాటైన ఈ ఆస్పత్రిని 2000 సంవత్సరంలో అప్పటి ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి 100 పడకలతో ప్రారంభించారు. అప్పటి నుంచి నిరంతరాయంగా సేవలు విస్తరిస్తూ నేడు 650 పడకల సామర్థ్యంతో దేశంలోనే సమగ్ర క్యాన్సర్ చికిత్సాలయంగా పేరు పొందింది.ప్రస్తుతం ఈ ఆసుపత్రి బాలకృష్ణ ఛైర్మన్‌గా, మేనేజింగ్ ట్రస్టీగా వ్యవహరిస్తూ తండ్రి ఆశయాన్ని పవిత్ర యజ్ఞంగా కొనసాగిస్తున్నారు. ఆయన నాయకత్వంలో ఆసుపత్రి ఏటా 3 లక్షల మందికి పైగా అవుట్‌పేషెంట్లకు, 90 వేల మంది ఇన్‌పేషెంట్లకు సేవలందిస్తోంది. ఇక్కడ చికిత్స పొందుతున్న వారిలో 65 శాతానికి పైగా ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారే ఉండటం విశేషం. ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ వంటి ప్రభుత్వ పథకాల ద్వారా కూడా వేలాది మందికి ఉచితంగా నాణ్యమైన వైద్యం అందుతోంది. ఇప్పటివరకు 8 వేలకు పైగా విజయవంతమైన క్యాన్సర్ సర్జరీలు, 86 బోన్ మ్యారో మార్పిడి చికిత్సలు ఇక్కడ నిర్వహించారు.

క్యాన్సర్‌పై అవగాహన కల్పించేందుకు, వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించేందుకు ఆసుపత్రి యాజమాన్యం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. అత్యాధునిక సదుపాయాలున్న మొబైల్ స్క్రీనింగ్ బస్సు ద్వారా మారుమూల గ్రామాలు, గిరిజన ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తోంది. సర్జికల్, మెడికల్, రేడియేషన్ ఆంకాలజీ వంటి విభాగాల్లో సుమారు 250 మంది నిపుణులైన వైద్యులు సేవలందిస్తున్నారు. సోమవారం జరగనున్న రజతోత్సవ వేడుకలకు సీఎం చంద్రబాబుతో పాటు పలువురు రాజకీయ, సినీ ప్రముఖులు, వైద్య నిపుణులు, దాతలు హాజరై ఆసుపత్రి 25 ఏళ్ల సేవా ప్రయాణాన్ని స్మరించుకోనున్నారు.

## క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఘనంగా యోగా దినోత్సవం

### పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు సిబ్బంది

### ఆకట్టుకున్న విద్యార్థుల యోగాసనాలు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 21)

ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రపంచ యోగా దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి క్విస్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా గొప్పతనం గురించి విద్యార్థులకు తెలియజేశారు. యోగా నిత్య జీవితంలో ఒక భాగంగా మార్చుకోవాలని అన్నారు. మానసిక వికాసం, జ్ఞానం పెంపొందేందుకు యోగా ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ కారణంగానే క్విస్ విద్యాసంస్థల విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని యోగ, పర్సనల్ డెవలప్మెంట్ ని కరిక్యులమ్ లో పెట్టినట్లు ఆయన చెప్పుకొచ్చారు. ఒకప్పుడు యోగా ఇక్కడి వరకే పరిమితం అయ్యిందని ప్రధాని మోడీ నేతృత్వంలో ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా యోగా దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామని చెప్పారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మేరా భారత్ డిస్ట్రిక్ట్ ఆఫీసర్ నరసింహ కుమార్ యోగా గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులతో కలిసి కల్యాణ్ చక్రవర్తి యోగాలో పాల్గొన్నారు. యోగా దినోత్సవం సందర్భంగా కళాశాల పీడీసీ సెల్, యోగా టీం ఆధ్వర్యంలో విద్యార్థులు ప్రదర్శించిన ప్రత్యేక యోగా ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో జిల్లాకి చెందిన పలువురు నాయకులు పాల్గొని యోగాసనాలు వేశారు. ఈ కార్యక్రమాన్ని ఎన్‌సీసీ డీన్ డాక్టర్ నవనీత కృష్ణన్, పీడీపీ సెల్ హెడ్ మోహన్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఫస్ట్ ఇయర్ హెచ్‌వోడీ డాక్టర్ శ్రీనివాసరావు, స్టూడెంట్ అసోసియేట్ డీన్ డాక్టర్ వాసుబాబు, తదితరులు పాల్గొన్నారు.






ప్రకాశం

మార్కాపురం

బాపట్ల

షణ్ముఖ
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు తెలుగు దినపత్రిక
22.06.26 సోమవారం




# మానవ జీవిత శైలిని మార్చే శక్తి యోగాకు మాత్రమే ఉంది

## జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత





(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, జూన్ 21)

యోగ మానవ జీవిత శైలిని మారుస్తుందని జిల్లా కలెక్టర్ ఎం విజయసునీత అన్నారు. ఆదివారం స్థానిక ఎస్‌వికెపి కళాశాల ప్రాంగణంలో ఆదివారం అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భం గా జిల్లా కలెక్టర్ విజయ సునీత, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా విద్యార్థులచే ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేకంగా అలరించాయి. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మానవ జీవితంలో యోగ ఒక భాగం కావాలని ఆమె చెప్పారు. ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థు లు, ఉద్యోగులు మానసిక ఒత్తిళ్లకు గురికాకుండా ప్రతి రోజు యోగా చేయాలన్నారు. మానవుల శరీరాన్నీ, ఆత్మను ఒకటిగా చేసేది యోగా మాత్రమేనని కలెక్టర్ వివరించారు. ప్రజలు యోగాను ఒక దినచర్యగా పాటిస్తే ఆరోగ్యకరమైన జీవితాన్ని పొందుతారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి యోగాని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పెద్ద ఎత్తున కార్యక్రమాలను చేపట్టిన విషయాన్ని వివరించారు. జిల్లాలో 14 రోజుల పాటు యోగ కార్యక్రమాలను నిర్వహించి ప్రజలను చైతన్యవంతం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మార్కా పురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ యోగా ప్రజల జీవితాల్లో ఒక భాగం కావాలని ప్రతిరోజు ఒక గంట పాటు యోగా చేస్తే మంచి ఆరోగ్యం పొందవచ్చున్నారు. ప్రతి రోజు యోగా చేస్తే పని ఒత్తిడి, మానసి ఒత్తిడి నుండి దూరం గా ఉండవచ్చునని యోగ ప్రాముఖ్యతను వివరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో ఐదు కోట్ల మంది ప్రజలను యోగాంధ్ర కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపు నిచ్చారన్నారు. యోగ సాధన వల్ల ప్రజల జీవన ప్రమాణాలు ఆరోగ్య పరిస్థితులు మెరుగుతాయని ముఖ్యమంత్రి ఆదేశాలను ప్రతి ఒక్కరు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో 14 రోజులపాటు జిల్లాలోని ప్రజలందరిని భాగ స్వామ్యం చేశామన్నారు. జిల్లాలో ప్రతి ఇంటికి ప్రతి కుటుంబానికి యోగ చేరే విధంగా అవగాహన కల్పించామని తెలిపారు. ఈ యోగా కార్యక్రమంలో విద్యార్థి ని విద్యార్థులు, ఉద్యో గులు మహిళలు, పుర ప్రజలు పాల్గొన్నారు. అనంతరం యోగాలో ప్రతిభ కనబరిచిన వారికి కలెక్టర్, ఎమ్మెల్యే, ఇతర అధికారులు బహుమతులు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు, ఆర్డీవో వెంకట శివరామిరెడ్డి, జిల్లా పౌర సంబంధాల అధికారి టి మోహన్ రాజు, జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్బారావు, జిల్లా వ్యవసాయ శాఖ ఇంచార్జి అధికారి బాలాజీ నాయక్, డిఎస్పీ నాగరాజు, మున్సిపల్ కమిషనర్ నారాయణరావు, తాసిల్దార్ చిరంజీవి. తదితరులు పాల్గొన్నారు. (తరువాయి 4లో...)

# సంపూర్ణ ఆరోగ్యానికి అనుదినం యోగా సాధన ఉత్తమ మార్గం

## రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జూన్ 21)

సంపూర్ణ ఆరోగ్యానికి అనుదినం యోగా సాధన ఉత్తమ మార్గమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి చెప్పారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం ఒంగోలులోని పోలీస్ పరేడ్ గ్రౌండ్లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ నూకసాని బాలాజీ, జిల్లా కలెక్టర్ పి రాజాబాబు ఐఏఎస్, ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు, జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారిలతో కలిసి ఆయన పాల్గొన్నారు. రాష్ట్ర స్థాయిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజయవాడలో పాల్గొన్న కార్యక్రమానికి సమాంతరంగా ఉదయం ఆరు గంటల నుంచి 6:45 గంటల వరకు జరిగిన యోగా సాధన కార్యక్రమంలో వీరు ఉత్సాహంగా ఆసనాలు వేశారు. ఈ కార్యక్రమంలో 2000 మంది వరకు మహిళలు, విద్యార్థులు, ఉద్యోగులు, ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ హ్యాపీ, హెల్తీ సమాజం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా యోగాంధ్ర కార్యక్రమానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. ప్రజలందరూ యోగా సాధనను తమ జీవితంలో భాగం చేసుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు.

జిల్లా కలెక్టర్ పి రాజాబాబు మాట్లాడుతూ యోగా సాధనపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించేలా చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లావ్యాప్తంగా మూడు లక్షల అరవై మూడు వేల మందికిపైగా ప్రజలు దీనికోసం రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు ఆయన తెలిపారు. అంతకుమించి యోగాసనాల కార్యక్రమంలో ప్రజలు పాల్గొన్నట్లు కలెక్టర్ చెప్పారు. గత 15 రోజులుగా జిల్లావ్యాప్తంగా 4428 వేదికలలో యోగాభ్యసన కార్యక్రమాలను నిర్వహించామన్నారు. వయసుతో సంబంధం లేకుండా ప్రజలు ఇందులో పాల్గొన్నట్లు తెలిపారు. ఈ యోగాసనాలను కొనసాగించడం ద్వారా పరిపూర్ణ ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చన్నారు. జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు మాట్లాడుతూ యోగాను ప్రతి ఒక్కరూ తమ జీవన విధానంలో భాగంగా చేసుకోవాలని పిలుపు నిచ్చారు. యోగా ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడి సానుకూల దృక్పథంతో జీవించవచ్చని తెలిపారు. వ్యక్తి ఆరోగ్యంగా ఉంటే కుటుంబం, సమాజం, దేశం కూడా పురోగతి సాధిస్తాయని, అందరూ యోగాను తమ నిత్య జీవితంలో ఒక భాగంగా మార్చుకొని, ఆరోగ్యకరమైన జీవనాన్ని అలవర్చుకోవాలని ఆశిస్తున్నానని తెలిపారు. ఏపి పర్యాట కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ మాట్లాడుతూ ఆరోగ్యకర జీవన శైలికి యోగా సాధన ఎంతో (తరువాయి 4లో...)

# పెట్టుబడులకు వేళాయె...!

## పారిశ్రామికవేత్తలతో నేడు ‘ బిజినెస్ ఎలైట్ మీట్ ’

## సాయంత్రం 5 గంటల నుంచి ఎస్‌జివిఎస్ కన్వెన్షన్ సెంటర్లో నిర్వహణ

## వివిధ ప్రాంతాల నుంచి తరలివస్తున్న డెలిగేట్స్

## జిల్లా అభివృద్ధిపై కలెక్టర్ రాజాబాబు ప్రత్యేక దృష్టి



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జూన్ 21)

మానవ వనరులు, సహజ వనరులు పుష్కలంగా ఉన్న ప్రకాశం జిల్లాకు పెట్టుబడులు కూడా తరలివచ్చేందుకు సమయం ఆసన్నమైంది..! ఔను... పారిశ్రామికంగానూ ప్రకాశం జిల్లాను మరింత ముందుకు తీసుకువెళ్లేందుకు జిల్లా యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. కలెక్టర్ పి రాజాబాబు మార్గ దర్శకత్వంలో పారిశ్రామికవేత్తలతో సోమవారం ప్రత్యేక ‘ బిజినెస్ ఎలైట్ మీట్ ‘ జరగనుంది.

ఒంగోలు నగరంలోని ఎస్‌జివిఎస్ కన్వెన్షన్ సెంటర్ దీనికి వేదికకానుంది.

**ఇదీ కార్యక్రమం...!**

పారిశ్రామీకరణకు జిల్లాలో ఉన్న అవకాశాలను వివరిస్తూ పెట్టుబడిదారులను ఆహ్వానించాలని కలెక్టర్ మదిలో మెదిలిన ఆలోచనే ఈ ‘ బిజినెస్ ఎలైట్ మీట్ ’. దీని కోసం జిల్లాతో పాటు ఇతర ప్రాంతాల్లోని ప్రముఖ పారిశ్రామికవేత్తలకు ఇప్పటికే ఆహ్వాన పత్రికలను అందించారు. ఈ ఆహ్వానాలు అందుకున్న 300 మందికి పైగా ఈ సదస్సులో పాల్గొనేందుకు అంగీకరించినట్లు అధికారులు తెలిపారు. ఈ విధంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న డెలిగేట్సును కన్వెన్షన్ హాలులోకి అనుమతిస్తారు. ఆహ్వానం అందుకున్న ఇతర విఐపిలకు కూడా ఈ హాల్లోకి ప్రవేశం ఉంటుంది. రిజిస్ట్రేషన్ చేసుకోని డెలిగేట్స్, అదేవిధంగా విఐపిలతో వచ్చే అనుచరుల కోసం (తరువాయి 4లో...)

# ప్రశాంతంగా ముగిసిన నీట్ పరీక్ష

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జూన్ 21)

మెడికల్ కళాశాలల్లో ప్రవేశాల కోసం ఆదివారం నిర్వహించిన ‘ నీట్ ’ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఒంగోలు నగరంలోని 6 సెంటర్లలో ఈ పరీక్ష నిర్వహించారు. దీని కోసం మొత్తం 1821 మంది అభ్యర్థులు నమోదు చేసుకోగా, 1624 మంది హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు. 197 మంది గైర్హాజరయ్యారు. అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పరీక్ష కేంద్రాల్లో అధికారులు అన్ని సౌకర్యాలను కల్పించారు. భద్రతాపరంగా ఎలాంటి సమస్యలు తలెత్తకుండా స్వయంగా జిల్లా ఎస్పీ శ్రీ.వి.హర్షవర్ధన్ రాజు అన్ని సెంటర్లలో ఏర్పాట్లను పరిశీలించారు.

# అద్దంకి "మెప్మా లో" అవినీతి కంపు నిజమేనా?

(షణ్ముఖ వెలుగు, అద్దంకి, జూన్ 21)




పట్టణంలోని మెప్మా (పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ)లో అవినీతి చోటు చేసుకుందని ఇటీవల వార్తా కథనాలు రావడంతో సామాన్య ప్రజలతో పాటు ప్రజా సంఘాల నాయకులు, ప్రతిపక్ష పార్టీ నాయకులు నివ్వెర పోయారు. ఇతర మండలాల మహిళల పేర్లతో బ్యాంకులో లోన్లు చేశారని వార్తల ద్వారా బయటకు పొక్కడంతో మెప్మాలో “అవినీతి కంపు” నిజమేనా అని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇదే అంశంపై ఇటీవల అద్దంకిలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నిజాలు నిగ్గు తేల్చాలని జై భీమ్ రావు భారత పార్టీ సమన్వయకర్త హేబేలు జిల్లా కలెక్టర్ రాజాబాబుకు అర్జీ ఇచ్చి వీలైనంత త్వరగా విజిలెన్స్ కమిటీ వేయాలని కోరారు. ఒకవేళ అవినీతి నిజమే అయితే సామాన్య ప్రజలు లోన్ల కోసం బ్యాంకుకు వెళితే నాన కండిషన్లు పెట్టే బ్యాంకులు మెప్మాలో బోగస్ లోన్లు ఎలా చేశారనే ఆరోపణలు ప్రతిపక్ష పార్టీల నుంచి వినిపిస్తున్నాయి. బోగస్ లోన్ల ఆరోపణల విషయంలో మెప్మా ఉన్నతాధికారులు స్పందించి నిజాలు నిగ్గు తేల్చి ప్రజలకు తెలియజేయాలని, వీలైనంత త్వరగా కలెక్టర్ పర్యవేక్షణలో విజిలెన్స్ కమిటీ విచారణ జరపాలని పట్టణవాసులు కోరుచున్నారు.



# మానవ జీవిత శైలిని మార్చే శక్తి యోగాకు మాత్రమే ఉంది





















## సంపూర్ణ ఆరోగ్యానికి అనుదినం యోగా సాధన ఉత్తమ మార్గం

ముఖ్యమన్నారు. చిన్ననాటి నుంచే ప్రతి ఒక్కరూ యోగా సాధన అలవాటు చేసుకోవాలని సూచించారు. గత రెండు వారాలుగా యోగాసనాలలో శిక్షణ ఇచ్చిన గురువులను ఈ కార్యక్రమంలో సత్కరించారు. కాగా, ఈ నెల 26వ తేదీన జరగనున్న అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని, 'నషా ముక్త్ భారత్' కార్యక్రమంలో భాగంగా "మాదకద్రవ్యాలకు దూరంగా ఉండండి" అనే సందేశంతో రూపొందించిన క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఈ కార్యక్రమంలో ఆవిష్కరించారు. అనంతరం, మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ స్వీకరించబోమని ప్రజలతో జిల్లా ఎస్పీ ప్రతిజ్ఞ చేయించారు. ఈ యోగాసనాల కార్యక్రమంలో డిఆర్ఓ మాధురి, జిల్లా పర్యాటక అధికారి తేళ్ల రవికుమార్, యోగాంధ్ర నోడల్ ఆఫీసర్ భీమ్ నాథ్, ఒంగోలు డిఎస్పీ ఆర్ శ్రీనివాసరావు, దర్శి డిఎస్పీ బాలమురళి కృష్ణ, డిటిసి డిఎస్పీ గురునాథ బాబు, ఏఆర్ డిఎస్పీ శ్రీనివాసరావు, సీఐలు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది, ట్రైనీ కానిస్టేబుళు , వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.










## పెట్టుబడులకు వేళాయె...!

ఈ ప్రాంగణంలో ప్రత్యేక లాంజ్‌ను అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. వీరికి కన్వెన్షన్ హాలులోకి ప్రవేశం ఉండదని, ప్రత్యేక పాసు తీసుకుని లాంజ్‌లో ఉండాలని కలెక్టర్ తెలిపారు. దీంతో పాటు మీడియా లాంజ్ కూడా ఉంటుందని చెప్పారు. హాలులో జరిగే కార్యక్రమాలను ప్రత్యక్ష ప్రసారం ద్వారా బయట లాంజ్‌లో ఉండేవారు వీక్షించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. సాయంత్రం ఐదు గంటల నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని, అనంతరం డెలిగేట్స్‌కు, విఐపిలకు, కార్యక్రమానికి వచ్చిన వారందరికీ డిన్నర్ ఏర్పాటు చేశారు.

**విజన్... యాక్షన్..!** ఇప్పటికే ప్రత్యేక గుర్తింపు పొందిన గ్రానైట్ గనులతోపాటు రామాయపట్నం పోర్టు, బీపీసీఎల్, ఇండోసోల్ పరిశ్రమల రాక, జిందాల్ కంపెనీ ప్రతిపాదనలతో ప్రకాశం జిల్లా పారిశ్రామిక శోభను సంతరించుకుంది. వీటికి అనుబంధంగా ఆగ్జిలియరి పరిశ్రమల ఏర్పాటుకు విస్తృత అవకాశాలు ఉన్నాయి. మరో వైపు ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలోనూ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పారిశ్రామిక పార్కులను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. ఇక్కడ తయారైన వస్తువుల రవాణా, ఎగుమతికి అన్ని విధాలా మార్గాలు కూడా ఉన్నాయి. ఇక్కడి భౌగోళిక స్థితిగతులను, పారిశ్రామిక పెట్టుబడులకు ఉన్న అవకాశాలను అధ్యయనం చేసిన కలెక్టర్, పారిశ్రామికాభివృద్ధిపరంగా ప్రకాశం జిల్లాను మరింత ఉన్నత స్థాయికి తీసుకువెళ్లాలని నిర్ణయించారు. ఆయన ఆలోచనకు కార్యరూపమే ఈ పెట్టుబడుదారుల సదస్సు..!

## యోగ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటిన గ్రీన్ స్పోర్ట్స్ మ్యాన్ ఆఫ్ ఇండియా సయ్యద్ రఫీ




**(షణ్ముఖ వెలుగు, కంభం, జూన్ 21)** మండలంలోని ఎల్ కోట గ్రామంలో అంతర్జాతీయ యోగ దినోత్సవం సందర్భంగా గ్రీన్ స్పోర్ట్స్ మ్యాన్ ఆఫ్ ఇండియా సయ్యద్ రఫీ ఆదివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపర్చుకోవడానికి ప్రతి ఒక్కరూ నిత్యం యోగా చేయాలని సూచించారు. యోగా ఆరోగ్యకరమైన జీవన విధానానికి ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి హరిత దీక్ష గౌరవ సభ్యుడు, ప్రకృతి ప్రేమికుడు బాలు నాయక్ సయ్యద్ రఫీ చేపడుతున్న పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలను అభినందించారు. గ్రామస్తులు కూడా మొక్కల సంరక్షణకు తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు.



## ఘనంగా అంతర్జాతీ యోగా దినోత్సవం





**(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, జూన్ 21)**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా అంతర్జాతీయ యోగాదినోత్సవ కార్యక్రమాలను ప్రవేశపెట్టాయని, అందులో భాగంగా ప్రతి ఒక్కరం భాగస్వాములై మన ఆరోగ్యాలను కాపాడుకునేందుకు యోగాసనాలు సంజీవనిలా పనిచేస్తాయని ఎంపీడీవో జయరాం నాయక్ పేర్కొన్నారు. 12వ ప్రపంచ అంతర్జాతీయ యోగ దినోత్సవ కార్యక్రమాన్ని ఎంపీడీవో జయరాం నాయక్ ఆధ్వర్యంలో స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకొని ఎంపీడీవో జయరాం నాయక్ మాట్లాడుతూ మానవ జీవితంలో యోగాసనాలు ఒక భాగమన్నారు. మానవ జీవితంలో యోగాసనాలు క్రమం తప్పకుండా చేయడం వల్ల శారీరక మృదుత్వం, అధిక బరువు తగ్గడం, ప్రాణాయామం, ధ్యానం, నాడీ వ్యవస్థ బలోపేతం కావడానికి, శరీరం మృదువుగా ఉంచేందుకు, ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. అంతే గాక యోగాసనాలు చేయడం వల్ల మంచి క్రమశిక్షణ, పట్టుదల, ఏకాగ్రత అలవడతాయన్నారు. కండరాలు బలపడతాయని, రక్తపోటు, మధుమేహం, పక్షవాతం, గుండెపోటు, నరాల బలహీనత, శారీరక, మానసిక రుగ్మతలలాంటి సమస్యల నుండి విముక్తి చెందుతారన్నారు. ఇలా చేయడం వల్ల అనారోగ్యాల బారిన పడకుండా మానవ జీవితం ఎంతో సుఖ సంతోషాలతో, ఆనందమయంగా జీవనం సాగించవచ్చన్నారు. అనంతరం యోగ గురువు నారాయణస్వామి మాట్లాడుతూ యోగాసనాలు చేయడం వల్ల మానవ జీవితానికి ఎంతగా ఉపకరిస్తాయో, యోగాసనాలు చేయకపోవడం వల్ల ఎంత ఉపయోగపడవో వాటి యొక్క ప్రయోజనాల గురించి సవివరంగా వివరించారు. అనంతరం యోగాలో ఉన్నటువంటి అభ్యసనాలన్నింటినీ అందరితో యోగాసనాలు చక్కగా నేర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, విద్యాశాఖ అధికారులు, వైద్యశాఖ అధికారులు, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామంలోని పెద్దలు, పాఠశాలలో 8, 9, 10వ తరగతులు చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## యోగా మానసిక ప్రశాంతతకు, ఒత్తిడిని అధిగమించడానికి ఎంతో దోహదపడుతోంది

### సీనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సెల్ అథారిటీ చైర్మన్ కేకేవి బులికృష్ణ







**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జూన్ 21)**

అంతర్జాతీయ యోగ దినోత్సవం సందర్భంగా ఆదివారం ఉదయం కందుకూరు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రాంగణంలో యోగ గురువు బి వి రమణ పర్యవేక్షణలో యోగా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా యోగాసనాలను వేయడం జరిగింది. ఈ యోగ కార్యక్రమంలో కందుకూరు సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్ కేకేవి బులికృష్ణ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి దుర్గా కళ్యాణి, అడిషనల్ మున్సిఫ్ మేజిస్టేట్ అన్నపూర్ణశ్రీ, కందుకూరు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వలేటి శ్రీధర్ నాయుడు, సీనియర్, జూనియర్, మహిళా న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# పొదిలిలో ఘనంగా అంతర్జాతీయ యోగాంధ్ర దినోత్సవం









**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 21)**

పొదిలి ఆర్టీసీ ప్రాంగాణంలో ఆదివారం ఉదయం పొదిలి పురపాలక సంఘం ఆధ్వర్యంలో యోగాంధ్ర - 2026 (12వ అంతర్జాతీయ యోగా దినోత్సవ) పట్టణ స్థాయి వేడుక కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యోగ గురువులు అప్పల శంకర్, పవన్ కార్యక్రమంలో పాల్గొన్న సాధకులతో యోగాసనాలు చేయించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా తహసిల్దార్ ఎంవి కృష్ణారెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఆంజనేయులు, మండల అభివృద్ధి అధికారి నరసింహారావు, రాష్ట్ర బిజెపి మహిళా మోర్చా సెక్రటరీ బెల్లంకొండ విజయలక్ష్మి, డిపో మేనేజర్ శంకర్రావు, రాష్ట్ర టిడిపి కార్యదర్శి గునుపూడి భాస్కర్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ "యోగతో ఆరోగ్యం-ఆరోగ్యంతో అభివృద్ధి" సాధ్యమవుతుందన్నారు. యోగా అనేది భారతదేశం ప్రపంచానికి అందించిన అమూల్యమైన ఆధ్యాత్మిక, సాంస్కృతిక వారసత్వం అన్నారు. శరీరం, మనస్సు, ఆత్మ మధ్య సమతుల్యతను కల్పించే మహోన్నత జీవన విధానమే "యోగం" అంటూ మన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దూరదృష్టి వల్ల 2014లో ఐక్యరాజ్యసమితిలో చేసిన ప్రతిపాదనకు రికార్డు స్థాయిలో దేశాలు యోగా కార్యక్రమానికి మద్దతు ఇవ్వడంతో, ప్రతి సంవత్సరం జూన్ 21ని అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ప్రపంచవ్యాప్తంగా నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. నేడు 190 కి పైగా దేశాల్లో కోట్లాది మంది యోగా ను ఆచరిస్తూ భారతదేశ ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటుతున్నారన్నారు. ఈ ఏడాది కూడా ప్రధానమంత్రి మోదీ యోగా దినోత్సవ కార్యక్రమాలకు నాయకత్వం వహిస్తూ, "యోగా" కేవలం వ్యాయామం మాత్రమే కాదు, ఆరోగ్యవంతమైన, ప్రశాంతమైన, శక్తివంతమైన సమాజ నిర్మాణానికి మార్గమని ఆయన పిలుపునిచ్చారన్నారు. ప్రభుత్వం ఎల్లప్పుడూ "ఫిట్ ఇండియా", "ఆయుష్", "యోగ" వంటి కార్యక్రమాల ద్వారా ప్రజల్లో ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహిస్తోందన్నారు. మన శారీరక ఆరోగ్యానికే కాకుండా మానసిక ప్రశాంతత, క్రమశిక్షణ, ఏకాగ్రతను పెంపొందిస్తుందన్నారు . ప్రతి ఒక్కరూ రోజూ కనీసం 30 నిమిషాలు యోగాభ్యాసం చేయాలని, కుటుంబ సభ్యులను కూడా యోగా వైపు ప్రోత్సహించాలని మనస్ఫూర్తిగా కోరుతున్నామన్నారు. యోగా భారతదేశపు ప్రాచీన జ్ఞానం. నేడు ప్రపంచ మానవాళికి మార్గదర్శకం అన్నారు. యోగాసనాలు ముగిసిన తదుపరి పొదిలి ఆర్టీసి డిపో మేనేజర్ శంకర్రావు యోగాసన సాధకులకు మంచినీళ్లు, పౌష్టికాహారంతో కూడిన జావను అందజేశారు. ఈ కార్యక్రమంలో పొదిలి పట్టణ పౌరులు, బెల్లంకొండ కాలేజీ విద్యార్థినిలు, కస్తూరి భా స్కూల్ విద్యార్థినులు, జర్నలిస్టులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలందరూ ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలన్నదే సీఎం చంద్రబాబు నాయుడి ఆకాంక్ష

- పేదల విద్య, వైద్యం ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట
- సీఎం చంద్రబాబు పేదలకు మేలు చేస్తుంటే..వైసీపీ ఓర్వలేకపోతోంది
- వైసీపీ ఓ విషవృక్షం, ప్రజలు దాన్ని కూకటి వేళ్ళతో పెకిలించాలి, లేకుంటే రాష్ట్రానికి ప్రమాదం
- తూర్పు నాయుడుపాలెం క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన మంత్రి స్వామి



**(షణ్ముఖ వెలుగు, కొండపి, జూన్ 21)**

ప్రజలందరూ ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలన్నదే సీఎం చంద్రబాబు నాయుడి ఆకాంక్ష అని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. ఆదివారం టంగుటూరు మండలం తూర్పు నాయుడుపాలెం క్యాంపు కార్యాలయంలో 92 మంది లబ్ధిదారులకు రూ.95.82 లక్షలు విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండేళ్ల కూటమి పాలనలో కొండపి నియోజకవర్గంలో ఇప్పటి వరకు 1856 మందికి 15.25 కోట్ల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కుల్ని పంపిణీ చేశాం. ప్రజలందరూ ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలన్నదే సీఎం చంద్రబాబు నాయుడి ఆకాంక్ష. పేదల విద్య, వైద్యం ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. పి 4 తో రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు సీఎం చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారు. సీఎం చంద్రబాబు పేదలకు మేలు చేస్తుంటే..వైసీపీ ఓర్వలేక రాష్ట్రంలో శవ, కుల రాజకీయాలు చేస్తోంది. వైసీపీ ఓ విషవృక్షం, ప్రజలు దాన్ని కూకటి వేళ్ళతో పెకిలించాలి, లేకుంటే రాష్ట్రానికి ప్రమాదకరమని మంత్రి స్వామి అన్నారు.



# ఏపీజిఇఏ మార్టూరు నూతన కార్యవర్గం ఎన్నిక



**(షణ్ముఖ వెలుగు, మార్టూరు, జూన్ 21)**

అంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం మార్టూరు తాలూకా యూనిట్ ఎన్నికలను బాపట్ల జిల్లా హడాక్ కమిటీ చైర్మన్ జివివి రాఘవరెడ్డి, కన్వీనర్ పి శ్రీనివాసరావు సారధ్యంలో ఆదివారం మార్టూరు ఓల్డ్ పంచాయతీ అవరణలో నిర్వహించారు. ఎన్నికల అధికారులు ఎన్ పి పుల్లారావు, కె అంజిబాబు అధ్వర్యంలో మొత్తం పది పోస్ట్‌లకు నామినేషన్లు స్వీకరించారు. యూనిట్ అధ్యక్షుడిగా ఐ సింగారెడ్డి, జెనరల్ సెక్రెటరీ పి శైలజ, ట్రెజర్ జి ప్రసన్న ఆంజనేయరావు, అసోసియేట్ ప్రెసిడెంట్ డాక్టర్ పి శ్రీ హర్ష, 1వ వైస్ ప్రెసిడెంట్ పి హర్షవర్ధన్, 2వ వైస్ ప్రెసిడెంట్ కె ప్రమీల రాణి, 3వ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ కె విష్ణువర్ధన్‌రెడ్డి, 1వ జాయింట్ సెక్రెటరీ ఎ తిరుమల, 2వ జాయింట్ సెక్రెటరీ ఐ హనుమంతరావు, 3వ జాయింట్ సెక్రెటరీ ఎ మాధురిలు ఎన్నికయ్యారు. అనంతరం ఎన్నికల అధికారులు నూతన కార్యవర్గంతో ప్రమాణస్వీకారం చేయించారు. సదరు నూతన కార్యవర్గం మూడేళ్ల పాటు సేవలు అందించనుంది. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను జిల్లా హడాక్ కమిటీ చైర్మన్ జివివి రాఘవరెడ్డి అభినందించారు.

# ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

## ఎంపీడీవో డాక్టర్ పి సుజాత





**(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, జూన్ 21)**

ప్రతి ఒక్కరూ ధైనందిన జీవితంలో యోగాను భాగం చేసుకోవాలని ఎంపీడీవో డాక్టర్ పి సుజాత తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గ్రౌండ్లో ఆదివారం అంతర్జాతీయ యోగా దినోత్సవం ఎంపీడీవో పి సుజాత ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ యోగాసనాలు, ప్రాణాయామం, ధ్యానం శరీరాన్ని సరళంగా ఉంచేందుకు, నాడీ వ్యవస్థ బలోపేతానికి ఎంతో దోహదం చేస్తాయని తెలిపారు. యోగ వల్ల రక్తపోటు మధు మొహం, గుండెపోటు, పక్షవాతం వంటి సమస్యలను నివారించవచ్చని అన్నారు. యోగాతో కండరాల బలపడతాయి, అధిక బరువును తగ్గించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మండవ ప్రసాద్, పల్లపోతు రమేష్ బాబు, ఎంఈఓ రవిచంద్రబాబు, ఉపాధ్యాయుడు వై వెంకటేశ్వరరావు వైద్యాధికారి రవి కిరణ్, భాస్కరరావు, ఏపీవో సుధాకర్, పల్లపోతు సురేంద్ర, గంధం నరసయ్య, ఆదాము, గ్రామంలోని ప్రజలు పాల్గొన్నారు

## ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం





**(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, జూన్ 21)**

మండలంలోని చిన్నగంజాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని యోగాంధ్రలో భాగంగా యోగా గురువు వలివేటి రామానుజం ఆధ్వర్యంలో ఆదివారం యోగా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఎస్ నరసింహారావు, ఎన్‌సిసి ఉపాధ్యాయులు సిహెచ్ సుబ్బారావు, శ్రీలక్ష్మి, మండల ఇంచార్జ్ శ్రీనివాస్ రావు, యోగాబ్యాసకులు సందు శ్రీనివాసరావు, ఎన్ శ్రీనివాసరావు,భయ్యా ప్రసాద్, పంచాయతీ సిబ్బంది ఎన్‌సిసి విద్యార్థులు, స్కౌట్ విద్యార్థులు పాల్గొన్నారు.

**సంతరావూరు ఆరోగ్య కేంద్రం నందు..**

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఆదివారం మండలంలోని సంతరావూరు ఆరోగ్య కేంద్రం నందు వైద్యదికారి కీర్తి సరోజ అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో యోగా పై శిక్షణ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కీర్తి సరోజ్ మాట్లాడుతూ సంపూర్ణ ఆరోగ్యంతో జీవించాలంటే ప్రతిరోజూ యోగా సాధాన చేయాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## కార్యకర్తలకు అండగా తెదేపా ప్రభుత్వం - ఏలూరి



**(షణ్ముఖ వెలుగు, మార్టూరు, జూన్ 21)**

ప్రమాదంలో మరణించిన చిన్నగంజాం మండలం చెందిన తెదేపా పార్టీ కార్యకర్త అలహరి సత్యనారాయణ కుటుంబనికి రూ.5లక్షల పార్టీ సంక్షేమ నిధి చెక్‌ను ఆదివారం పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అందజేశారు. పర్చూరు నియోజకవర్గం చిన్నగంజాం మండలం సోపిరాలకు చెందిన అలహరి సత్యనారాయణ ఇటీవల మరణించారు. ఆదివారం మార్టూరు ఇసుకదర్శి క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అలహరి సత్యనారాయణ కుటుంబ సభ్యులకు ఏలూరి చేక్ అందజేశారు. ఇ సందర్భంగా ఏలూరి మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలకు,నాయకులకు తెలుగుదేశం పార్టీ ఎప్పుడు అండగా వుంటుందన్నారు.ఈ కార్యక్రమంలో మండల తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నిరాడంబరంగా పొదిలి ప్రెస్ క్లబ్ నూతన కమిటి ప్రమాణా స్వీకారం

### విలేకర్ల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తామని హామీ
### నూతన కమీటికి అభినందనలు తెలిపిన సభ్యులు



**(షణ్ముఖ వెలుగు, పొదిలి, జూన్ 21)**

పొదిలి ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్, వెబ్ ఛానల్స్ రిపోర్టర్స్ అందరు కలిసి ఏకగ్రీవంగా కమీటిని ఎన్నుకున్నారు. స్థానిక శ్రీ మంజునాథ ఎసి ఫంక్షన్ హాలు నందు ఆదివారం కమీటి ప్రమాణా స్వీకారం చేశారు. విలేకర్ల సంక్షేమానికి, అభివృద్ధికి సభ్యుల సహకారంతో పాటుపడతామని మనస్సాక్షిగా ప్రమాణం చేశారు. నూతన కమీటి ఆధ్వర్యంలో పొదిలి ప్రెస్ క్లబ్ స్థల సేకరణ, శాశ్వత భవన నిర్మాణానికి ప్రయత్నిస్తామని నూతన కమిటీ అధ్యక్షులు చప్పిడి శ్రీనివాసులు తెలిపారు. సీనియర్ పాత్రికేయులు స్వర్గీయ కె బుగ్గలింగయ్య మీడియాలో తనకంటు ప్రత్యేక స్థానం నిలుపుకున్నారని, ఈ సందర్భంగా వారిని స్మరించుకోవడం చాల సంతోషంగా ఉందని సినియర్ పాత్రికేయులు బాజి అన్నారు. అనంతరం నూతన కమీటిని సభ్యులు హర్షధ్వానాలతో స్వాగతం పలికారు. కమీటీకి ఎప్పుడు ఏ అవసరం వచ్చిన అందుబాటులో ఉండి సరైన సూచనలు ఇస్తామని సినియర్ పాత్రికేయులు మువ్వ వెంకటేశ్వర రెడ్డి, బండి అశోక్, నర్ర వెంకటేశ్వరెడ్డి తెలిపారు. కమీటి కార్యదర్శిగా జెకె విశ్వనాథ్, ఉపాధ్యక్షులుగా జి కిషోర్, కొశాధికారిగా ముల్ల హసన్ వలి (బడే), గౌరవ సలహదారులుగా మందగిరి వెంకటేష్, మదార్ వలి, తదితరులు ప్రమాణ స్వీకారం చేశారు.

# 7వ బెటాలియన్‌కు పియస్ఆర్ అండ

### ఏపీ ప్రత్యేక పోలీస్ బెటాలియన్ ప్రాంగణంలో ఒంగోలు బుల్స్ ప్రారంభించిన టిడిపి నాయకులు పోతినేని శ్రీనివాసరావు











**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 21)**

సంతనూతలపాడు నియోజకవర్గంలో సేవా కార్యక్రమాలతో ప్రత్యేక గుర్తింపు పొందిన టీడీపీ సీనియర్ నాయకులు పోతినేని శ్రీనివాసరావు (పీఎస్ఆర్) మరోసారి తన సామాజిక బాధ్యతను చాటుకున్నారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే బి ఎన్ విజయకుమార్ ఆదేశాలతో గుండ్లపల్లి గ్రోత్ సెంటర్‌లోని ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక పోలీసు 7వ ఏఆర్ బెటాలియన్ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తూ, ఆర్థిక సాయంతో నిర్మించిన ప్రవేశ ద్వారం, ఒంగోలు బుల్స్ ప్రతిరూపాలను ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పియస్ఆర్ కి అధికారులు, నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం కమాండెంట్ ఏ మురళి, అడిషనల్ కమాండెంట్ జనార్ధన్‌రెడ్డి, స్థానిక ప్రముఖులు, టీడీపీ నాయకులతో కలిసి ఒంగోలు బుల్స్‌ను లాంఛనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమాండెంట్ ఏ మురళి మాట్లాడుతూ మంచి పనుల కోసం ఎప్పుడూ ముందుండే వ్యక్తిగా పోతినేని శ్రీనివాసరావు (పీఎస్ఆర్) నిలుస్తున్నారని, 7వ బెటాలియన్ అభివృద్ధికి ఆయన అందిస్తున్న సహకారం ఎంతో విలువైనదని ప్రశంసించారు. బెటాలియన్ అవసరాలను గుర్తించి స్పందిస్తున్న ఆయన సేవాభావం ఆదర్శనీయమని కొనియాడారు. పోతినేని శ్రీనివాసరావు (పిఎస్ఆర్) మాట్లాడుతూ రాష్ట్ర భద్రత కోసం కృషి చేస్తున్న పోలీసు సిబ్బందికి ఉపయోగపడే కార్యక్రమాల్లో భాగస్వామి కావడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే బి ఎన్ విజయ్‌కుమార్ సహకారంతో, మద్దిపాడు మండల ప్రముఖులు, నాయకులతో కలిసి 7వ బెటాలియన్‌కు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు ఎల్లప్పుడూ ముందుంటానని తెలిపారు. అలాగే గుండ్లపల్లి గ్రోత్ సెంటర్‌లో 7వ బెటాలియన్ ఏర్పాటుకు ఎమ్మెల్యే బి ఎన్ విజయ్ కుమార్ చేసిన కృషి, అందిస్తున్న సహకారం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమం ముగింపులో అధికారులు, ప్రముఖులు పీఎస్ఆర్ సేవలను కొనియాడుతూ ఘనంగా సత్కరించారు. బెటాలియన్ అభివృద్ధికి ప్రజా ప్రతినిధులు, సామాజికవేత్తలు కలిసి ముందుకు రావడం అభినందనీయమని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్యదర్శి అడకా స్వాములు, మద్దిపాడు మండల టిడిపి అధ్యక్షులు ఉప్పుగుండూరి నాగేశ్వరరావు, మండల టిడిపి ప్రధాన కార్యదర్శి మందపల్లి శ్రీనివాసరావు, మల్లవరం ఆలయ చైర్మన్ మారినేని రాఘవ, టిడిపి నాయకులు మన్నే రామారావు, గట్టినేని అయ్యన్న, రాయపాటి శ్రీనివాసరావు, గడ్డం రవి, కూకట్ల శరత్ బాబు, వడ్డేంపూడి శ్రీనివాసరావు, మోనా పాటి రామకృష్ణ, బొమ్మల చిరంజీవి, ఊదరగుడి హనుమంతరావు, మద్దులూరి సుధాకర్, కావూరి విజయరాజు, సాయి, బెటాలియన్, బృందం, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దాత, టిడిపి నాయకులు పోతినేని శ్రీనివాసరావును బెటాలియన్ అధికారులు సత్కరించారు.

# యాదవ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు ప్రధానం చేసిన వేణుగోపాల స్వామి దేవస్థానం

### అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ఘనంగా సన్మానించిన ఎమ్మెల్యే ముత్తుముల






**(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, జూన్ 21)**

గిద్దలూరు పట్టణంలోని శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన యాదవ సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులకు ఏర్పాటు చేసిన ప్రతిభా పురస్కర కార్యక్రమానికి ఆలయ అధ్యక్షులు చల్ల బాల నరసింహులు అధ్యక్షత వహించగా, గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. పదవ తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 30 మంది విద్యార్థులను ఎమ్మెల్యే శాలువా, జ్ఞాపిక, ప్రైజ్ మనీలతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత ఫలితాలు సాధించడం ఎంతో ఆనందదాయకమని, విద్యార్థుల జీవితాల్లో క్రమశిక్షణ, పట్టుదల ఎంతో ముఖ్యమని, సమాజ అభివృద్ధికి విద్యే ప్రధాన ఆధారమని, విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని మరింత కృషి చేసి భవిష్యత్తులో ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ప్రైజ్ మనినీ చల్లా.బాల నరసింహులు, ఉపాధ్యాయులు చల్లా రమేష్, మొరస బాల గురవయ్య, డాక్టర్ మొర్రి పిచ్చయ్యలు సహకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు చల్లా బాల నరసింహులు, ప్రధాన కార్యదర్శి యాలగాని వెంకటేశ్వర్లు, గౌరవ సలహాదారులు నంద్యాల శ్రీనివాసులు, గిద్దలూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ బైలడుగు బాలయ్య, టీడీపీ నాయకులు బిల్లా రమేష్, బూనబోయిన చంద్ర శేఖర్, ఓ వెంకటయ్య, చల్లా రమేష్, డాక్టర్ మొర్రి పిచ్చయ్య, యం బాల గురవయ్య, జింకా వెంకటేశ్వర్లు, బోధనబోయిన గోపాల్, జంగాల బాలయ్య, బొర్రా రాఘవేంద్ర యాదవ్, దేవస్థానం కమిటీ సభ్యులు, యాదవ సంఘం నాయకులు, తల్లిదండ్రులు, మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# నేడు మార్టూరులో గన్నవరం రహదారి అభివృద్ధి పనులకు శంకుస్థాపన

## ఎమ్మెల్యే ఏలూరి చేతుల మీదుగా ప్రారంభం



**(షణ్ముఖ వెలుగు, పర్చూరు, జూన్ 21)**

పర్చూరు నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికి మరో ముందడుగు పడనుంది. ఈ నెల 22 అనగా సోమవారం ఉదయం 10.30 గంటలకు మార్టూరులో గన్నవరం-మార్టూరు రహదారి అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు చేతుల మీదుగా శంకుస్థాపన మహోత్సవం నిర్వహించనున్నారు. ఎమ్మెల్యే ఏలూరి ప్రత్యేక కృషి ఫలితంగా గన్నవరం-మార్టూరు- నాగరాజుపల్లి రహదారికి రూ.8.80 కోట్లు, పునూరు-గన్నవరం రహదారికి రూ.3 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. ఆయా పనులకు ఎమ్మెల్యే ఏలూరి మార్టూరు, గన్నవరం గ్రామాలలో శంకుస్థాపన చేయనున్నారు. ఈ పనులు పూర్తయితే గ్రామీణ ప్రాంత ప్రజలకు రాకపోకలు మరింత సౌకర్యవంతంగా మారనున్నాయి.ఈ రహదారుల దుస్థితిని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పలుమార్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఆర్అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి నిధుల మంజూరుకు కృషి చేశారు. ఆయన ప్రయత్నాలు ఫలించి నిధులు విడుదల కావడంతో గత ఐదేళ్లుగా దెబ్బతిన్న రోడ్లతో ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రజలు, వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి జనార్ధన్ రెడ్డి, ఎమ్మెల్యే ఏలూరికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

# యోగా, ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం



## ప్రస్తుత జీవన విధానంలో, తప్పక అలవాటు చేసుకోండి
## ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పిలుపు
## కందుకూరులో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు
## హాజరైన సబ్ కలెక్టర్ హిమవంశీ, మున్సిపల్ కమీషనర్ అనూష
## ఆసనాలు వేసిన అధికారులు, నేతలు, విద్యార్థులు






(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జూన్ 21)

ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవితంలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ఎంతో ముఖ్యమని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. ప్రతి ఒక్కరూ యోగా, ధ్యానం అలవాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. అంతర్జాతీయ దినోత్సవం సందర్భంగా కందుకూరులోని పామూరు బస్టాండులో యోగాంధ్ర - 2026 కార్యక్రమాన్ని ఆదివారం ఉదయం నిర్వహించారు. ఎమ్మెల్యే నాగేశ్వరరావుతోపాటు సబ్ కలెక్టర్ దామెర హిమవంశీ, మున్సిపల్ కమిషనర్ అనూష హాజరయ్యారు. కూటమి పార్టీల నేతలు, కార్యకర్తలు, అధికారులు, వివిధ పాఠశాలల విద్యార్థులు యోగాసనాలు వేశారు. ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రధానమంత్రిగా నరేంద్ర మోడీ బాధ్యతలు చేపట్టాక, అంతర్జాతీయ స్థాయిలో యోగాకు ప్రాముఖ్యత పెరిగిందని అన్నారు. ప్రస్తుతం ఒడిదుడుకుల జీవన విధానంలో యోగాసనాలు, ధ్యానం, వ్యాయామాల ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. డాక్టర్లు కూడా వీటికి ప్రాధాన్యత ఇస్తున్న విషయాన్ని అందరూ గమనించాలని నాగేశ్వరరావు సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారు 75 ఏళ్ల వయసులో ఆరోగ్యంగా ఉన్నారంటే అందుకు కారణం ఇలాంటి పద్ధతులే కారణమని ఎమ్మెల్యే అన్నారు. ఉత్సాహంగా పాల్గొని యోగా దినోత్సవాన్ని జయప్రదం చేసిన ప్రతి ఒక్కరికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. యోగా ద్వారా శారీరక, మానసిక ప్రశాంతత కలుగుతుందని, క్రమం తప్పకుండా ఆసనాలు వేస్తుంటే, ఆరోగ్యపరంగా మార్పులను స్వయంగా చూడవచ్చని సబ్ కలెక్టర్ దామెర హిమవంశీ అన్నారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ప్రతి సచివాలయం పరిధిలో యోగా దినోత్సవ వేడుకలు నిర్వహించినట్లు కమీషనర్ అనూష తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ బీజేపీ అధ్యక్షుడు ఘట్టమనేని హరిబాబు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, బీజేపీ నాయకులు వరప్రసాదరావు, టీడీపీ నాయకులు ఉప్పుటూరి శ్రీనివాసరావు, చిలకపాటి మధుబాబు, చదలవాడ కొండయ్య, బెజవాడ ప్రసాద్, ఉన్నం కొండలరావు, షేక్ రూబీ, షేక్ రఫీ, షేక్ మున్నా, చుండూరి శ్రీను, కల్లూరి శైలజ, పువ్వాడి మౌనిక, కొత్తూరి వెంకట సుధాకర్, గడ్డం మాలకొండయ్య, అత్తంటి శ్రీహరినాయుడు, దామా రాంబాబు, ముచ్చు వేణు, పొన్నగంటి వెంకట్రావు, స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





## యువతలో సామాజిక రుగ్మతలను రూపుమాపేందుకు కరాటే ఒక ఆయుధం
### సీనియర్ బ్లాక్ బెల్ట్ కరాటే మాస్టర్ వడ్డే వేణు





(షణ్ముఖ వెలుగు, పొదిలి, జూన్ 21)

యువతలో సామాజిక రుగ్మతలను రూపుమాపేందుకు కరాటే ఒక ఆయుధంగా దోహదపడుతుందని స్థానిక సీనియర్ బ్లాక్ బెల్ట్ కరాటే మాస్టర్ వడ్డే వేణు అన్నారు. ఆదివారం స్థానిక ఎన్జీవో హోంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఈనెల 28న తిరుపతిలో జరిగే జాతి స్థాయి టోర్నమెంటులో పోటీలకు విద్యార్థులు ఎంపిక కార్యక్రమంలో వేణు మాట్లాడుతూ నేటి తరం యువత మాదకద్రవ్యాలు మత్తు పదార్థాలకు బానిసలై చెడు మార్గం పట్టకుండా ఉండేందుకు కరాటే నేర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. బాలికలకు మహిళలకు కరాటే ఆత్మ రక్షణ కోసం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. సీనియర్ కరాటే మాస్టర్ వేణు చీఫ్ ఎగ్జామినర్ గా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో ఐదుగురు సభ్యులతో కూడిన బృందాన్ని జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా తమ నైపుణ్యం ప్రదర్శించే విధంగా ఒళ్ళు గగుర్పాటు గురి చేసే విధంగా మండే పెంకులను బ్రేకింగ్ చేసే కరాటే ప్రదర్శనలు విద్యార్థులు అలరించాయి. అనంతరం ఫాదర్స్ డే సందర్భంగా కేక్ కట్ చేస్తే మిఠాయిలు పంచారు. ఈ కరాటే బెల్ట్ టెస్ట్ కు చీఫ్ ఎగ్జామినర్స్‌గా వడ్డే వేణు వ్యవహరించగా ఎగ్జామినర్స్‌గా వడ్డే కళ్యాణ్ సాయి, వడ్డే మాధవ్, ఉమర్, వి వీరేంద్ర, కరాటే విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ముటుకూరు ఏఈఎల్ఈ ఆధ్వర్యంలో ఘనంగా ఫాదర్స్ డే వేడుకలు



(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, జూన్ 21)

దుర్గి మండలం ముటుకూరు గ్రామంలోని ఆదివారం ఆంధ్ర ఇవాంజిలికల్ క్రీస్తు లూథరన్ దేవాలయం నందు ఏఈఎల్సి సంఘం ఆధ్వర్యంలో చర్చి డెలిగేట్ మాచర్ల యేసయ్య అధ్యక్షతన ఫాదర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వెస్ట్ గుంటూరు సినడ్ పల్నాడు ఫీల్డ్ ఎక్స్ యాక్టింగ్ బిషప్ చర్చి పాస్టర్ రెవరెండ్ కటికల యేసుదానం మాట్లాడుతూ ఈ లోకంలో అన్నింటికి మించిన ప్రేమ నాన్న ప్రేమని త్యాగానికి మారుపేరు నాన్న అని ప్రతి ఒక్కరూ తల్లిదండ్రులను గౌరవించాలని తెలియజేస్తూ ఆధ్యాత్మిక సందేశాన్ని అందజేసి అందరికీ ఫాదర్స్ డే శుభాకాంక్షలు తెలియజేశారు. పల్నాడు జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ మెంబర్ మరియు దళిత బహుజన సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కుక్కమూడి ప్రసాద్ మాట్లాడుతూ కుటుంబం కోసం ప్రతిక్షణం శ్రమిస్తూ పిల్లల భవిష్యత్తు కోసం ఎన్నో త్యాగాలు చేసే తండ్రి ప్రేమను గుర్తించి వారిని గౌరవించడానికి ప్రపంచవ్యాప్తంగా మూడవ ఆదివారం ఫాదర్స్ డే వేడుకలను జరుపుకుంటారని, నాన్న అంటే ధైర్యం, బాధ్యత,నమ్మకం, భరోసా అని అలాంటి నాన్న త్యాగాలను ప్రతి ఒక్కరూ గుర్తు చేసుకోవాలని ప్రతి ఒక్కరూ వారి తల్లిదండ్రులను గౌరవించుకోవాలని వారి ప్రేమ త్యాగాలు వెలకట్టలేనివని ఈ భూమి మీద దీర్ఘాయుష్మంతులు కావాలి అంటే బైబిలు వాక్యం నిర్గమ 20-12 ప్రకారం తల్లిదండ్రులను సన్మానించాలని, ఆయన అన్నారు. అందరికీ ఫాదర్స్ డే శుభాకాంక్షలు తెలియజేశారు. చర్చి డెలిగేట్ మాచర్ల యేసయ్య ఆల్టర్నేట్ డెలిగేట్ మాచర్ల జార్జి మాజీ ఎక్స్ డెలిగేట్ మాచర్ల సామేలు, పులిమెల్ల వెంకయ్య మాట్లాడి ఫాదర్స్ డే శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆత్మీయ తండ్రి పాస్టర్ రెవరెండ్ కటికల యేసుదానంతో కలిసి కేక్ కట్ చేసి ఆయనను శాలవాలతో ఘనంగా సత్కరించారు. ఫాదర్స్ డే సందర్భంగా చర్చికి వచ్చిన విశ్వాసులకు సంఘస్తులకు స్వీట్లు బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పిసిసి మెంబర్స్ పులిమేల అచ్చయ్య, మాచర్ల ఆనందరావు, కుక్కమూడియ, మాచర్ల లూకయ్య, సంఘ పెద్దలు పులిమేల జక్రయ్య, మాచర్ల దేవదానం, మాచర్ల మైఖేల్, మాచర్ల పెద్ద అచ్చయ్య, మాచర్ల పురుషోత్తం, పులిమేల ప్రసాద్, కుక్కమూడి ఏసోబు, కుక్కమూడి మరియదాసు, తదితరులు పాల్గొన్నారు.

# శిద్దాకు డాక్టరేట్ ప్రకటించిన అమెరికన్ యూనివర్సిటీ

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 21)

ప్రముఖ గ్రానైట్ వ్యాపార,పారిశ్రామిక వేత్త,మాజీ మంత్రి శిద్దా రాఘవరావుకి అమెరికాకు చెందిన ప్రఖ్యాత టాప్ లెవెల్ విద్యా సంస్థ మేరీ ల్యాండ్ యూనివర్సిటీ ఆంధ్రప్రదేశ్‌లోని ఒంగోలుకు చెందిన ప్రముఖ గ్రానైట్ వ్యాపార వేత్త, మాజీ మంత్రి శిద్దా రాఘవ రావుకి డాక్టరేట్ ను ప్రకటించింది. ప్రపంచ వ్యాప్తంగా సమాజానికి ఉత్తమ సేవలు, ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణ, బిజినెస్ మేనేజ్మెంట్ తదితర అంశాలపై విశేష సేవలు అందించినందుకు ప్రతిఫలంగా శిద్దా రాఘవరావు సేవలు స్వయంగా గుర్తించిన మేరీ ల్యాండ్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ సోఫియా నుబాని, చాన్సలర్ డాక్టర్ జాన్ ఎన్ కలరస్ సంయుక్తంగా రాఘవరావుకి డాక్టరేట్‌ను ప్రకటించారు. ఈ మేరకు ఆదివారం ఒంగోలు రైస్ మిల్లర్స్ అసోసియేషన్ హాల్‌లో జరిగిన లయన్స్ క్లబ్ నిర్వహించిన ఒక కార్యక్రమంలో డాక్టరేట్ బిరుదు అందుకున్న శిద్దా రాఘవరావుని అభినందిస్తూ సత్కరించారు. డాక్టరేట్ అందుకున్న మాజీ మంత్రి శిద్దా రాఘవరావును పలువురు ప్రముఖులు అభినందిస్తూ శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ పిఎమ్‌జెఎఫ్ఎమ్ ఉపేంద్ర, లయన్ అంబటి సుధాకర్‌రెడ్డి, చీమకుర్తి లయన్స్ క్లబ్ సభ్యులు డాక్టర్ జవహర్, లయన్ డి శాంతి, లయన్ హరి ప్రసాదరావు, లయన్ ఆర్ లక్ష్మి నారాయణ, లయన్ డాక్టర్ వై గాంధీ, లయన్ పి విజయ కుమార్‌రెడ్డి, లయన్ నామినేని మెహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.









## పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే దామచర్ల కుటుంబం






(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 21)

ఒంగోలు నగరంలోని సౌత్ బైపాస్ రోడ్డు లోని హర్షిణి కాలేజి నందు ఆదివారం ఎమ్మెల్యే కుమార్తెలు దామచర్ల అనిషా లక్ష్మి, దామచర్ల తనూజ లక్ష్మి డీజేఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వరసగా 2వ సంవత్సరం కూడా 5వ తరగతి చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులు కోసం నిర్వహిస్తున్న టాలెంట్ టెస్ట్ దామచర్ల నాగసత్యలత తో కలిసి పరీక్ష కేంద్రంను ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా జనార్దన్ విద్యార్థిని, విద్యార్థులు, తల్లితండ్రులను ఉద్దేశించి మాట్లాడుతూ ఈ రోజు డీజేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించడం జరిగిందన్నారు. ఇందులో బాగా పరీక్ష రాసిన వారిలో మొదట 100 మంది విజేతలకు చదువులుకు అయ్యే ఖర్చు మొత్తం ట్రస్ట్ ఆధ్వర్యంలో చేయడం జరుగుతుందన్నారు. గత సంవత్సరం కూడా 100 మంది విద్యార్థిని, విద్యార్థులకు ట్రస్ట్ ద్వారా పూర్తిగా అన్ని ఖర్చులతో చదివించడం జరుగుతుందని తెలిపారు. ఈ సంవత్సరం కూడా 100 మంది విద్యార్థులకు డీజేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వారికి పూర్తిగా అయ్యే ఖర్చు ట్రస్ట్ భరించడం జరుగుతుందని తెలియజేసారు. తల్లితండ్రులు కూడా పిల్లల విషయాలలో శ్రద్ద వహించి, పిల్లలను బాగా చదివించాలని, ఆ చదువే రేపటికి వారికి ఆస్తి అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గోరంట్ల సంస్థల చైర్మన్ గోరంట్ల రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

## మండల బూత్ కన్వీనర్‌లతో సమావేశం

(షణ్ముఖ వెలుగు, ఎర్రగొండపాలెం, జూన్ 21)

స్థానిక ఎర్రగొండపాలెంలోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు ఎర్రగొండపాలెం మండల బూత్ కన్వీనర్‌లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎర్రగొండపాలెం ఎమ్మెల్యే, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రక్రియను బూత్ కన్వీనర్లు అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ఓటర్ల జాబితా పరిశీలన, మార్పులు, చేర్పుల పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ప్రతి బూత్ పరిధిలో అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా పర్యవేక్షించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ నాయకులు పాల్గొన్నారు.



# గ్రామీణ ప్రజలకు వరంగా ఎమ్మెల్యే ఏలూరి మెగా వైద్య శిబిరం

**యద్దనపూడిలో ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన**
**460 మందికి కంటి పరీక్షలు.. 153 మందికి శస్త్రచికిత్సకు రిఫర్**
**గుండె పరీక్షల్లో 122 మందికి ఈసీజీ, 63 మందికి ఎకో పరీక్షలు**
**పేదలకు వైద్యం అందించడమే ఎమ్మెల్యే ఏలూరి లక్ష్యం**
**రంగయ్య చౌదరి**

(షణ్ముఖ వెలుగు, యద్దనపూడి, జూన్ 21)
గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను చేరువ చేయాలనే లక్ష్యంతో పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సారథ్యంలో నిర్వహించిన మెగా ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. నోవా అగ్రి గ్రూప్, గ్రీన్స్ పార్క్ ఫౌండేషన్ సహకారంతో ఆస్టర్ రమేష్ ఆసుపత్రి, శంకర్ కంటి ఆసుపత్రి వైద్య బృందాల సౌజన్యంతో యద్దనపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం ఈ శిబిరం నిర్వహించారు. తొలుత స్వర్గీయ నందమూరి తారక రామారావు, ఏలూరి నాగేశ్వరరావు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం యద్దనపూడి మండల అధ్యక్షుడు నల్లపనేని రంగయ్య చౌదరి శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని నిరంతరం చేపడుతున్న వైద్య సేవా కార్యక్రమాలు గ్రామీణ ప్రజలకు ఎంతో మేలు చేస్తున్నాయని కొనియాడారు. పేద, మధ్యతరగతి కుటుంబాలు పెద్ద ఆసుపత్రులకు వెళ్లి వైద్యం చేయించుకునే ఆర్థిక భారం నుంచి ఉపశమనం పొందేందుకు ఇటువంటి శిబిరాలు దోహదపడుతున్నాయని పేర్కొన్నారు. ప్రజలకు ఇంటి వద్దకే వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఎమ్మెల్యే ఏలూరి మండలాల వారిగా ప్రతినెల ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. లక్ష మందికి కంటి చూపు అందించడమే లక్ష్యంగా ఎమ్మెల్యే ఏలూరి క్యాంపులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కంటి వైద్య పరీక్షలకు 460 మంది హాజరుకాగా, వారిలో 153 మందిని శస్త్రచికిత్సల కోసం వైద్యులు ఎంపిక చేసి రిఫర్ చేశారు. ఆస్టర్ రమేష్ ఆసుపత్రి వైద్య బృందం నిర్వహించిన గుండె సంబంధిత పరీక్షల్లో 122 మందికి ఈసీజీ, 63 మందికి ఎకో పరీక్షలు నిర్వహించారు. శిబిరానికి వచ్చిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక కౌంటర్ల ద్వారా ఓపీ సేవలు అందించడంతో పాటు రక్తపోటు, మధుమేహ నిర్ధారణ పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సూచనలు అందించారు. మండల నాయకులు, పార్టీ కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని వైద్య సేవలను వినియోగించుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య అవగాహన పెంపొందించడంతో పాటు అవసరమైన వైద్య సేవలను నిరంతరం కొనసాగించడం అభినందనీయమని పలువురు నేతలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు జీ తారక రామారావు, కనపర్తి నాగేశ్వరరావు, నారాయణస్వామి ,వెంకటేశ్వర్లు, సాంబయ్య, ప్రభాకర్, వరద, సుధీర్, హరిబాబు, వీరయ్య, సింగ్ చంద్రశేఖర్, నాగేశ్వరరావు, కోటేశ్వరరావు, శివరామయ్య,బాబు,అనిల్, బాజీ, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.





## ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



(షణ్ముఖ వెలుగు, చీరాల, జూన్ 21)
చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య జన్మదిన వేడుకలను ముందస్తుగా ఆదివారం ఘనంగా నిర్వహించారు. చల్లారెడ్డిపాలెం గ్రామ పార్టీ అధ్యక్షులు కీర్తి పూర్ణ యాదవ్ ఎమ్మెల్యే కు కేకు తినిపించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఎమ్మెల్యే కొండయ్య పుట్టినరోజు నియోజకవర్గంలోని ప్రజలందరికీ పండుగ లాంటిదని కీర్తిపూర్ణ కొనియాడారు. కొండయ్య ఎమ్మెల్యేగా నియోజకవర్గంలోకి అడుగుపెట్టగానే చీరాల రూపురేఖలు మారిపోయాయని అన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా అభివృద్ధి, సంక్షేమం రెండు జరిగాయని కీర్తిపూర్ణ తెలియజేశారు. చీరాలకు శాశ్వత ఎమ్మెల్యే కొండయ్యేనని కీర్తి పూర్ణ స్పష్టం చేశారు. తండ్రి బాటలో నడిచే మహేంద్రనాథ్, అమర్నాథ్ నేతృత్వంలో పార్టీలకు అతీతంగా పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందాయని ఆయన చెప్పారు.

## దివ్యాంగులకు అండగా కూటమి ప్రభుత్వం

ఎమ్మెల్యే ఎం ఎం కొండయ్య





(షణ్ముఖ వెలుగు, చీరాల, జూన్ 21)
చీరాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ దివ్యాంగుల సంక్షేమ శాఖ బాపట్ల జిల్లా ఆధ్వర్యంలో ఆదివారం దివ్యాంగులకు వివిధ ఉపకరణాలు, వాహనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య లబ్ధిదారులకు 10 మోటార్ వెహికల్స్, 5 ట్రైసైకిళ్లు, 5 వీల్‌చైర్లు అందజేశారు. అలాగే డీఆర్‌డీఏ వెలుగు అధికారుల ద్వారా 3 తోపుడు బండ్లు, 2 కార్లు, ఒక ఆటోను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మానవతా దృక్పథంతో ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. విభిన్న ప్రతిభావంతులను ఆదరించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందిస్తే దివ్యాంగులు మరింత ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతారని అన్నారు. వారి సంక్షేమం, సమాజంలో భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## జీవన విధానంలో యోగా భాగం కావాలి

ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు



(షణ్ముఖ వెలుగు, వినుకొండ, జూన్ 21)
ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవన విధానంలో యోగాను ఒక భాగంగా మార్చుకోవాలని ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా వినుకొండ రూరల్ పరిధిలోని నిర్మల పాఠశాలలో నిర్వహించిన వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, విద్యార్థులతో కలిసి జీవీ ఆంజనేయులు యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ యోగా అనేది మన పూర్వీకులు, ఋషులు భారతదేశ సంస్కృతి సాంప్రదాయాల ద్వారా మనకు అందించిన అమూల్యమైన వరం అని కొనియాడారు. ప్రస్తుత ఆధునిక, బిజీ జీవన విధానంలో మనుషులకు తెలియకుండానే మానసిక ఒత్తిడి పెరిగిపోతోందని, ఫలితంగా చిన్న వయసులోనే బీపీ, షుగర్ వంటి వ్యాధుల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లక్షల కోట్లు ఉన్నా ఆరోగ్యం లేకపోతే వ్యర్థమని, ఆరోగ్యాన్ని మించిన మహాభాగ్యం మరొకటి లేదని ఆయన స్పష్టం చేశారు. యోగా, ప్రాణాయామం చేయడం ద్వారా శరీరంలోని కోట్ల కణాలకు ఆక్సిజన్ అంది అవి యాక్టివేట్ అవుతాయని, దీనివల్ల ఆలోచనా విధానం అద్భుతంగా మెరుగై, ఒత్తిడి తగ్గి నిత్యం ఆనందంగా ఉండవచ్చని వివరించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపుతో నేడు ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు మన యోగాను ఆచరిస్తున్నాయని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విద్యార్థి దశ నుంచే పాఠశాలల్లో యోగాను అలవాటు చేస్తున్నారని, ప్రతి ఒక్కరూ నిత్యం యోగాను సాధన చేస్తూ 'ఆరోగ్య ఆంధ్రప్రదేశ్' సాధనలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపు నిచ్చారు.




## చెరుకుంపాలెం నీటి కుంటలో పడి మృతి చెందిన పిల్లల కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే దామచర్ల





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 21)
ఒంగోలు నగర పరిధిలోని చెరువుకొమ్ముపాలేం గ్రామం నందు గత 15 రోజుల క్రితం నలుగురు పిల్లలు నీటిగుంటలో పడి ప్రమాదవశాస్తు మరణించిచడం జరిగినది. ఆదివారం మధ్యాహ్నం ఒంగోలు నియోజకవర్గ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు వారి కుటుంబ సభ్యులను ఇంటింటికి వెళ్లి పరామర్శించి, వారి కుటుంబాలకు మనోధైర్యాన్ని నింపి బాధిత కుటుంబాలను ఆదుకుంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వినుకొండ సుబ్రమణ్యం, ఏఎంసీ చైర్మన్ రాచగర్ల వెంకటరావు, నగర పార్టీ అధ్యక్షులు బండారు మదన్, టిడిపి నాయకులు పెళ్లూరు చిన్న వెంకటేశ్వర్లు (క్లాసిక్), నిడమానూరు రమేష్, బొడ్డపాటి వెంకట్, గుంటూరు రాంబాబు, చెరుకుంపాలెం డివిజన్ అధ్యక్షులు రోశయ్య, టిడిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ మొర్రి పిచ్చయ్యను సన్మానించిన గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల




(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, జూన్ 21)
గిద్దలూరు పట్టణానికి చెందిన హిందీ ఉపాధ్యాయులు డాక్టర్ మొర్రి పిచ్చయ్యకు ఇటీవల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ నేషనల్ బెస్ట్ టీచర్ అవార్డు వచ్చిన సందర్భంగా గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ఆదివారం వేణుగోపాలస్వామి దేవస్థానం నందు నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో అభినందిస్తూ సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో స్టేట్ బెస్ట్ టీచర్ అవార్డు, జాతీయ అవార్డులతో గిద్దలూరు నియోజకవర్గానికి మంచి పేరు తీసుకొచ్చిన హిందీ ఉపాధ్యాయులు పిచ్చయ్య సేవలను ప్రశంసించారు. తన వార్షిక వేతనంలో 20 శాతం డబ్బులను పాఠశాల, విద్యార్థుల విద్యాభివృద్ధికి ఖర్చు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘ నాయకులు పాల్గొని డాక్టర్ మొర్రి పిచ్చయ్యకు అభినందనలు తెలియజేసి సన్మానించారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com